
మహాభారతం

# భారతావతరణం



**ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్**

**www.freegurukul.org**


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం వెబ్ సైట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) తిరుమల తిరుపతి దేవస్థానం వారి వెబ్ సైట్: http://ebooks.tirumala.org
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారి సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Helpline/WhatsApp: 9042020123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## TTD(తిరుమల తిరుపతి దేవస్థానం)


## http://ebooks.tirumala.org



# అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# భారతావతరణము

కళాప్రపూర్ణ డాక్టర్ దివాకర్ల వేంకటావధాని



తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# భారతావతరణము

గ్రంథకర్త

కళాప్రపూర్ణ డాక్టర్ దివాకర్ల వేంకటావధాని

ప్రచురణ

కార్యనిర్వహణాధికారి,

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

2008

# BHARATHAVATHARANAMU

*BY*

***Dr.Divakarla Venkatavadhani***

T.T.D. Religious Publications Series No.170

© All Rights Reserved

TTD First Edition . 1983

Reprint : 2008

Copies : 1000

***Published by***

**K.V.Ramanachary,** I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

***D.T.P. Type Setting***

Editor's Office, TTDs, Tirupati.

***Printed at***
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati.

# మున్నుడి

భారతీయ వాఙ్మయ చరిత్రలో మహాభారతం ఒక మహోన్నతస్థానాన్ని పొందిందని చెప్పడంలో అతిశయోక్తి ఎంతమాత్రం లేదు. ఈ ఉద్గ్రంథంలో చెప్పబడని విషయంగానీ, విశేషంగాని ఇతరత్రా ఎక్కడా లేనే లేవన్నది సత్యమైన మాట. వేదవ్యాసమునీంద్రులు నాలుగు వేదాలసారంగా ఈ మహాభారతాన్ని రచించారనీ, అందువల్లే ఇది పంచమవేదంగా ప్రసిద్ధిపొందిందని పెద్దలమాట.

భారతీయవైభవాన్ని సంస్కృతిని ప్రతిబింబించే ఈ మహాభారత కావ్యాన్ని తెనిగించవలసిందని రాజమహేంద్ర ప్రభువు రాజరాజనరేంద్రుడు మహాకవి నన్నయభట్టారకుని ప్రార్థించినాడు. అందుకు నన్నయభట్టారకుడు పూనుకొనుట ఇందులో ప్రస్తావించబడింది. సందర్భానుసారంగా ఆనాటి రాజకీయ, మత, సాంఘిక విషయాలు వెల్లడించబడినవి.

కళాప్రపూర్ణ డాక్టర్ దివాకర్ల వేంకటావధానిగారు ఎంతో మనోరంజకంగా భారతాంధ్రీకరణను రూపకంగా మలిచారు.

రాజరాజు, ఆయన కుమారుడు కులోత్తుంగుడు, మంత్రి వజ్జియప్రెగ్గడ, ఆస్థానపండితులైన నన్నయభట్టు, వేములవాడ భీమన, క్షేమేంద్రుడు, పావులూరి పెదమల్లన, చినమల్లన, బేతనభట్టు, నన్నయ సహాధ్యాయి నారాయణభట్టు ఈ రూపకంలో పాత్రలుగా సమాదరింపబడ్డారు.

తిరుమల తిరుపతి దేవస్థానం వారు పునర్ముద్రిస్తున్న ఈ పుస్తకం సాహితీప్రియుల మన్ననలు అందుకుంటుందని ఆశిస్తున్నాను.

**(భూమన కరుణాకరరెడ్డి)**
**అధ్యక్షులు**
**తి.తి.దే.పాలకమండలి, తిరుపతి.**

# ఆముఖం

'భారతావతరణము' ఒక చిన్న గోష్ఠీరూపకం. రాజ మహేంద్రవరంలో రాజరాజనరేంద్రుడు, పురాణ ప్రవీణులైన పౌరాణికులతో, రసభావ రచనా విశారదులైన మహాకవులతో, తర్కవ్యాకరణ గణిత జ్యోతిర్విద్యా విశారదులైన విద్వాంసులతో జరిపిన విద్యావిలాసగోష్ఠి ఇందులో అభివర్ణించబడింది.

రాజరాజు, ఆయనకుమారుడు కులోత్తుంగుడు, మంత్రి వజ్జియప్రెగ్గడ, ఆస్థానపండితులైన నన్నయభట్టు, వేములవాడ భీమన, క్షేమేంద్రుడు, పావులూరి పెదమల్లన, చినమల్లన, బేతనభట్టు, నన్నయసహాధ్యాయి నారాయణభట్టు - ఈ రూపకంలో పాత్రలుగా సమాదరింపబడ్డారు.

రాజనరేంద్రుడి ఒడ్డోలగంలో జరిగిన. ఈ విద్వత్ సమ్మేళనంలో భారతాంధ్రీకరణావసరం నొక్కివక్కాణించబడింది. భారతం తెనిగించడానికి నన్నయ పూనుకుంటాడు.

ప్రసక్తానుప్రసక్తంగా ఈ రుచిర రూపకంలో ఆనాటి సాంఘిక రాజకీయ మతపరమైన విషయాలు వెల్లడించబడ్డాయి.

కళాప్రపూర్ణ డా॥ దివాకర్ల వేంకటావధానిగారు ఎంతో మనోజ్ఞంగా ఈ రూపకం రూపొందించారు

తిరుమల తిరుపతి దేవస్థానంవారిచే పునర్ముద్రితమవుతున్న ఈ పుస్తకాన్ని సాహితీప్రియులు సమాదరింపగలరని ఆశిస్తున్నాను.

(కె.వి.రమణాచారి)
కార్యనిర్వహణాధికారి
తి.తి.దేవస్థానములు, తిరుపతి.

# 'భారతావతరణము'

**నన్నయభట్టాది కవులును, యువరాజును**
**సభలో నాసీనులై యుందురు.**

రాజకులాగ్రగణ్యా! బహుపరాకు
చాళక్యవంశపాథోధిపూర్ణశశాంకా! బహుపరాకు
ధరామరాశీః పరంపరావర్ధిత నిత్యోదయా బహుపరాకు
శుభ్రయశః పరిపాండుర సర్వదిగంతరాళా బహుపరాకు
అదిక్షత్ర చరిత్రా బహుపరాకు
సంగరాంగణోపలబ్ధ విజయశ్రీ సమాశ్రితబాహుదండా బహుపరాకు
కావ్యగీతప్రియా బహుపరాకు
నానావనీనాథ కిరీటతటీరత్న పుంజరంజిత పాదపంకజా బహుపరాకు
కవీంద్రసమాజ సురభూజా బహుపరాకు
విమలాదిత్యతనూజా బహుపరాకు
వేంగీవిషయామరేంద్రా! రాజరాజనరేంద్రా బహుపరాకు

అను బహుపరాకులు వినబడుచుండగా రాజరాజును మంత్రి వబ్జియ ప్రెగ్గడయు ప్రవేశింతురు. కవులు నిలబడుదురు.

## I

**రాజరాజు:**

కవిపండితులకును త్రైలోక్య మల్లసోమేశ్వర సార్వభౌమ సామ్రాజ్య రథసారథులు శ్రీ నారాయణభట్టామాత్యవర్యులకును మా ప్రణామాంజలులు. యువరాజునకు ఆశీఃశుభాకాంక్షలు. తామందరు సుఖాసీనులు కండు.

**నన్నయ్య :**

రాజకళావిభూషణుఁడు రాజమనోహరు, నన్యరాజతే
జో జయశాలి శౌర్యుని, విశుద్ధయశశ్శరదిందుచంద్రికా
రాజిత సర్వలోక, నపరాజితభూరిభుజాకృపాణ ధా
రాజల శాంతశాత్రవపరాగుని, రాజరాజనరేంద్రుఁబ్రోచుతన్.

నారాయణభట్టు :

ఆశ్రితపోషణంబున, ననంతవిలాసమునన్, మనీషి వి
ద్యాశ్రమతత్త్వవిత్త్వమున, దానగుణాభిరతిన్, సమస్త వ
ర్ణాశ్రమ ధర్మరక్షణమహామహిమన్ మహినొప్పు సర్వలో
కాశ్రయు రాజరాజవసుధాధిపు శంకరుఁ డోము గావుతన్.

పెదమల్లన :

శ్రీరమణీగృహాంగణము చెన్నువహింప నలంకరింపగా
తోరణమున్ గృహాంగణము దోహలిగా సమకుర్చనాఁడగన్
జేరి యురంబునందు తులసీవనమాలయు కౌస్తుభంబు నొ
ప్పారనెసంగు శ్రీపతి దయామతి రాజనరేంద్రు నేలుతన్.

క్షేమేంద్రుడు :

సన్మార్గేణ కులం కళాగమపరిజ్ఞానేన కుర్వన్ ధియం
దీనానాథ జనార్థితార్థనివహత్యాగేన లక్ష్మీం స్థిరామ్
సంపూర్ణామలచంద్రికాం విశదయన్ కీర్త్యా జగద్గీతయా
సర్వాశాస్సమలంకరోతు సుతరాం చాళుక్యచూడామణిః

బేతనభట్టు :

శ్రీవత్సాంకుడు భక్తవత్సలుఁడు లక్ష్మీప్రాణనాథుండు రా
జీవాక్షుండు సమస్తభూతభువనక్షేమంకరానేక రూ
పావిర్భావుఁడు వాసుదేవుఁడను కంపావాసుఁడై దానవి
ద్యా విఖ్యాతుని బ్రోచుఁగావుత చళుక్యక్ష్మాతలాఖండలున్.

వేములవాడ భీమన :

శ్రీమదుమామహేశు లతిచిత్రవిలాసులు దారు మున్ వియో
గామిత చింత నొందొరులకై సగమౌటలు నిచ్చఁ దెల్పు కాం
క్షా మహిమంబుచే చెరిసగంబుగ నొక్క యొడల్ ధరించు స
త్ప్రేమపు దంపతుల్ సదయదృష్టుల రాజనరేంద్రుఁబ్రోచుతన్

చినమల్లన :

శ్రీరామావసుధాకళత్రుఁడు, విరించిన్ పుష్పబాణాసనున్
గారా మారగ కన్నతండ్రి త్రిజగత్ కళ్యాణసంధాయి, శృం
గారాధీశుఁడు విష్ణుదేవుఁడు లసత్కారుణ్యపూర్ణేక్షణుం
డై రక్షించు నిరంతరంబును చళుక్యాంభోధి శీతాంశునిన్.

**యువరాజు :**

**శ్రీసత్యాశ్రయవంశమండన, రణక్రీడా విపక్షాచలో**
**త్రా సప్రోద్యత పక్షఖండన; నరేంద్రా! రాజరాజేంద్ర! వేం**
**గీ సామ్రాజ్యధురంధరా! త్రిభువనాంగీకారదోస్సార! సం**
**తోసం బొప్పగఁ గైకొనంగదె కులోత్తుంగ ప్రణామాంజలుల్.**

**రాజరాజు :**

హితైషులును విద్వత్కవీంద్రులునైన తమ ఆశీర్వచనములే మా సామ్రాజ్యమునకు కొండంతబలము. మీ కందరికిని మా ధన్యవాదములు. నారాయణభట్టామాత్యా !

**ధీరధిషణావధీరిత**
**సౌరగురూ! మీరు మాదు సభ నీ గతి నిం**
**పారగఁ గై సేయుట బం**
**గారమునకు తావియబ్బు కరణి ఘటిల్లెన్.**

**మంత్రి వజ్జియప్రెగ్గడ :**

మన కుల బ్రాహ్మణులైన నన్నయభట్టారకులప్రక్క మంత్రివర్యులు నారాయణభట్టుగారు కూర్చుండుట చూడగా మున్నెన్నడో నరనారాయణులొక్కచో కూర్చుండిన సన్నివేశము స్మృతికి తగులుచున్నది.

**రాజరాజు :** మంత్రిగారి ఉపమానము అత్యంత సముచితముగానున్నది.

**కులోత్తుంగుడు :**

వారిరువురును సంధివిగ్రహులేగాక సహాధ్యాయులు కూడ! సహపాఠిత్వము రూపసాదృశ్యము కూడ కలిగించినది.

**పెదమల్లన :**

నన్నయభట్టుగారు తమ సహాధ్యాయులనుగూర్చి ఒకసారి చెప్పగా వినియుంటిని. వారి ప్రతిభా మహత్త్వములు వర్ణనాతీతములు. శాస్త్రములందేకాక రాజనీతియందుకూడ నిష్ణాతులగుటచే సోమేశ్వరసార్వభౌముల కొల్వున మంత్రి పదవి నందజాలిరి.

**వేములవాడ భీమన :**

సహపాఠులిర్వురును మహారాజుల కొలువులలో ఉన్నతపదవుల నొందగల్గుట ముదావహము.

**నారాయణభట్టు :**

మీరందఱును సహృదయశేఖరులు - గుణములే తప్ప దోషములు మీకు గోచరింపవు. మిత్రులు నన్నయగారి మూలమున మీ సభను దర్శించి దేవరవారి పండితప్రీతిని మీ సౌజన్యమును చవిచూడగల్గితిని.

**మంత్రి వజ్జియప్రెగ్గడ :**

మహాప్రభూ! నేడు పర్వదినము. దేవరవారు వేంగీరాజ్యమధిష్ఠించి నేటికి సరిగా ముప్పది సంవత్సరములైనది. ప్రజలందఱును తమ పట్టాభిషేకోత్సవము నానంధముతో చేసికొనుచున్నారు. మనమును ఈనాడు విద్వద్గోష్ఠిని ఏర్పాటు చేసితిమి. సభకు తర్కసాగరవిగాహన గరీయః ప్రతిభులైన తార్కికులును, పదశాస్త్రవారాశి కుంభసంభవులైన వైయాకరణులును మధురవచనరచనావిచక్షణులైన విద్వాంసులును, గణితజ్యోతిర్విద్యావిశారదులైన పండితులును ఏతెంచియున్నారు. దేవరవారిసభ దేవేంద్రుని సభను పురుడించుచున్నది. ఈ శుభసమయమున త్రైలోక్య మల్లసోమేశ్వర సార్వభౌమ సచివులును, అష్టాదశ భాషావధారణ చక్రవర్తులును, సుకవీంద్రులును, వానసవంశదుగ్ధాబ్ధి రాకాశశాంకులును, మీదుమిక్కిలి మన నన్నయ్యభట్టుగారికి సహాధ్యాయులునైన నారాయణభట్టుగారుకూడ నరుదెంచుట సన్నివేశ సంతోషమును ద్విగుణీకరించుచున్నది. నారాయణభట్టుగారెంతటి విద్వాంసులో అంతటి రాజనీతివేత్తలు. ఈ రెండుగుణములు నొక్కచో గోచరించుట అపూర్వము. నన్నయ్యభట్టుగారు మొన్న 'కళ్యాణీ' నగరమునకు వెళ్ళినపుడు తమ మిత్రులైన మంత్రీంద్రుల నీ సభ కాహ్వానించినట్లు చెప్పియున్నారు. వారా ఆహ్వానమును మన్నించి నేడిచటి కేతెంచుట వారి సౌజన్యమునకు నిదర్శనము. మహానుభావులరాక శుభోదర్కమని పండితులు చెప్పుదురు. అది సర్వదా సత్యశోభితము.

**నన్నయభట్టు :**

వజ్జియప్రెగ్గడగారు చెప్పినది ముమ్మాటికి సత్యము. మిత్రులు నారాయణభట్టుగా రూరకే రాలేదు. త్రైలోక్య మల్లదేవరవారి అనుగ్రహముతో కూడిన మైత్రీసందేశమునుగూడ గొనివచ్చినారు. అది మనకు వరప్రదానము.

**బేతనభట్టు :**

వృద్ధుడనైన నేనీ శుభసమయ మెప్పుడరుదెంచునా యని ఎదురుచూచుచున్నాను. రాజరాజనరేంద్రులు అమృతహృదయులు. పరిపంథులనుగూడ పరమమిత్రులుగ నాదరింతురు. దానిని వారు సరసహృదయముతో గ్రహింపరు.

**కులోత్తుంగుడు :**

అందుచేతనే రాజ్యము సుభిక్షముగా సాగుచున్నను విద్రోహుల కుట్రలను కూడ నెదుర్కొనవలసి వచ్చుచున్నది. రాజపదవి పూలపాన్పుకాదు. ప్రక్కలో బల్లెములెప్పుడును కదలుచునే యుండును.

**వేములవాడ భీమన :**

నారాయణభట్టుగారి ఆగమనముచే ప్రక్కలోని బల్లెములన్నియు భగ్నములైనవి. వారు సార్వభౌముల అనుగ్రహ సందేశములతో నరుదెంచుట అపారానందమును కలిగించుచున్నది. రాజ్యశాంతికై చేయుచున్న జప తపములు ఫలించినవి. లేనిచో సహజ శాంతారాములమైన మేము పరశురామత్వమును ప్రకటింపవలసివచ్చెడిది.

**చినమల్లన :**

దేవరవారి జాతకమును జాగరూకతతో పరిశీలించితిని. సౌహార్ద సంవిధానమున కిది అత్యంతానునుకూలమైన కాలము.

**రాజరాజు :**

సోమేశ్వర సార్వభౌముల అనుగ్రహ సందేశమును వీనులార విని ఆనందింపగోరుచున్నాను.

**నారాయణభట్టు :**

దేవరవారడుగుటకు ముందే సందేశమును వినిపింపనెంచితిని. నన్నయ్యభట్టుగారి ఆహ్వానమువలన "ఏకక్రియాద్వ్యర్థకరీ" అను లోకోక్తి సార్థకమైనది. ఒకటి దేవరవారి పట్టాభిషేకోత్సవమును కన్నులవిందుగా చూచుట. రెండవది మా రాజదేవేంద్రుల శుభసందేశమును వినిపించుట. "సోదరులైన రాజరాజనరేంద్రులకు ఆశీఃపూర్వకముగా దెల్పునది. తమ కులబ్రాహ్మణుల ఆహ్వానమందుకొంటిమి. తమ పట్టాభిషేకోత్సవమునకు స్వయముగా రాజాలకపోతిమి. మా మంత్రివర్యులు నారాయణభట్టుగారు వచ్చి మేము రాని

లోపమును పూరింతురు. పరిస్థితులు సరిగా తెలియని హేతువున మేము తమ వ్యతిరేకులకు సాయముచేసి తమకు క్లేశము కలిగించినందులకు చింతించుచున్నాము. ఇకముందట్లు జరుగదు. నన్నయభట్టుగారు అన్ని విషయములను విశదీకరించిరి. వారు మత్యమరాధిపాచార్యులు, సత్త్వమూర్తులు, వారి హితోపదేశము ననుసరించుచు తాము నిశ్శంకముగా రాజ్యము పాలించుకొనవచ్చును. మేము బాంధవ్యముచే గాక రాజకీయబంధముచే కూడ తమకు సోదరులమే."

**రాజరాజు :**

సోమేశ్వరు లనుగ్రహించినారు. మనకష్టములు గట్టెక్కినవి. మిత్రమా! నన్నయా! మేమే మీకు యావజ్జీవ ఋణగ్రస్తులమైతిమి.

**నన్నయభట్టు :**

నాకు కాదు. నారాయణభట్ట మహామాత్యులకు.

**కులోత్తుంగుడు :**

అది నిజమే. దేవరవారు నారాయణభట్టుగారిని యథోచితముగా సత్కరింపవలయును.

**మంత్రి వజ్జియప్రెగ్గడ :**

నా మనస్సునందలి ఊహను యువరాజుగారే వెల్లడించినారు.

**రాజరాజు :**

నే నిదివఱకే నిశ్చయించుకొంటిని. నందమపూడిని నారాయణభట్టుగారికి అగ్రహారముగా నమర్పింపవలయునని. (హర్షము-కరతాళములు) నన్నయ్యగారేదో చెప్పదలచినట్లున్నారు.

**నన్నయభట్టు :**

సంతోషపారవశ్యమున శాసనకావ్యమునందలి శ్లోకములు పొంగిపొఱలి వచ్చుచున్నవి.

**మంత్రి వజ్జియప్రెగ్గడ :**

శాసన కావ్యకర్తలు తమరే కావలయును. ఆ శ్లోకములను వినిపింపుడు.

**నన్నయభట్టు :**

"యస్సంస్కృత కర్ణాట ప్రాకృత పైశాచికాంధ్ర కవిరాజ
శేఖర ఇతి ప్రథితస్సుకవిత్వవిభవేన భాషాసు
కవీన్ మనీషాలవదుర్విదగ్ధాన్
మనోహరాభిర్నిజసూక్తిభిర్యః
కుర్వన్నగర్వాన్ పటుభిర్బిభర్తి
కవీభవజ్రాంకుశనామసార్థమ్
తస్మైసకలజగదభినుతగుణశాలినే, సరస్వతీకర్ణావతంసాయ
అష్టభాషావధారణచక్రవర్తినే నన్నినారాయణాయ
నందమపూణ్డిగ్రామోఽ గ్రహారీకృత్యధారాపూర్వకమస్మాభి
స్సర్వకరపరిహారేణ దత్త ఇతి విదితమస్తు వః."

**రాజరాజు :**

అట్టి సర్వజగన్మనోహరగుణునకు
సకల భాషావధారణచక్రవర్తి
కార్యసుతునకు నన్నినారాయణునకు
నర్థి నందమపూడ్య గ్రహారమిత్తు.

తమరు దానిని సర్వకర పరిహారముగా వంశపారంపర్యముగ ననుభవింతురు గాక!

**క్షేమేంద్రుడు :**

విడువక యాపదల్ తొడర వేసరి మానసికప్రశాంతి లే
కడరెడు మా మహీంద్రుని కనంత విభూతి సుఖమ్ముగూర్చి మా
పుడమికి నీవుచేసిన యపూర్వపుసేవ నుతింప శక్యమే
యెడతెగకుండ స్నేహమిది యెప్పుడు సాగుత మంత్రిపుంగవా!

**చినమల్లన :**

ఒకటిం జేకొని రెంటినిన్మరచి, యెంతో నేర్పుతో మూటినిం
బ్రకటస్ఫూర్తివహించి, నాల్గిటిని సంరంభంబుతో జూపి, ధా
ర్మికచింతారతి నైదిటిం గెలిచి ధాత్రీపాలు సంతోష కీ
ర్తికలాపాన్వితు జేసినట్టి నిను వర్ణింతున్ మతిద్యోగురున్.

**వేములవాడ భీమన :**

మతివైభవమున వంశ
ద్వితయమునకు మైత్రిఁగూర్చి ప్రీతిన్ మా కా
తత శుభమును ఘటియించిన
మతిగురునారాయణాఖ్య మంత్రిన్ దలఁతున్.

**బేతనభట్టు :**

రాజనీతిజ్ఞు సకలశాస్త్రార్థవిజ్ఞు,
ప్రాజ్ఞు, లోకజ్ఞు, సర్వజ్ఞు, ప్రాభవజ్ఞు,
పరహితాచరణ క్రియాపాటవజ్ఞు,
ప్రణుతి సేతు నారాయణభట్టమంత్రి.

**పెదమల్లన :**

అగణితమతివయ్యా నీ
వు గణితమతి నేను, నిన్నుఁబొగడగ నా కె
ట్లగు నారాయణభట్టా !
నిగమాగమశాస్త్రసార నిరుపమపట్టా !

**నన్నయభట్టు :**

చిరకాలస్థిత చిత్తశల్యమును రాశీభూతరాణ్ణీతివై
పెరకంజాలితి మా నృపాలునకు నిర్ఫీతిన్ కళాకావ్యమా
ధురిగ్రోలంగల యిమ్ము చూపితివి. నీ తోరంపు సౌహార్దమన్
సురభూజాతము నీడ నిల్తు మిఁక సంతోషంబుతో మిత్రమా!

**నారాయణభట్టు :**

పనియొకరిది. ఫలమొకరిది. ఉపకారమేమైన జరిగిన చేయించినవాడు నన్నయ. నేనేమి చేసితిని. రాజాజ్ఞను మోసికొనివచ్చితిని. "పుణ్యైర్యశో లభ్యతే" అని పెద్దలనిరి. యశమేకాదు ఫలమును.

**మంత్రి వజ్జియప్రెగ్గడ :**

తమసాయము మా కాజన్మస్మరణీయము. దానికిది అత్యల్పమైన చిహ్నమంతే – మా కవిపండితుల కవితామాధుర్య మొకింతసేపు తమకు చవిచూపుదుము. అష్టభాషా మహాకవులైన తమరును చర్చలో పాల్గొనగోరుచున్నాము.

**నారాయణభట్టు :**

సంతోషము.

# II

**మంత్రి వజ్జియప్రెగ్గడ :**

పెదమల్లనగారు ఈ సమస్యను పూరింతురుగాక.
గములు................ చిందునట్లుగా

**పెదమల్లన :**

అమరవరేణ్య ప్రేంఖణములాడెడి వేలుపుచాన జూచి యే
చెమరిచి తంచు కేళిసరసీరుహ మెత్తి ప్రతాప మొప్పగా
హిమగిరిరాజనందిని మహేశ్వరు సేసె మధూళికాపరా
గములు శశాంకశేఖరుని కన్నులనిండుగ చిందునట్లుగా.

**మంత్రి వజ్జియప్రెగ్గడ :**

గల కలవాణి .... గుట్టుముట్టగన్.

**క్షేమేంద్రుడు :**

వలపులసొంపు కెంపుడిగి వన్నియ వాల్గడకన్నులం గనం
గలకలమంచుమించు మృదుగద్గదభాషలు నేకతంపు చ
ర్యలు వెలలేని మెచ్చుల యొయారి తుటారి మిటారి యొప్పులన్
గల కలవాణి యే నరుని గాకలఁ బెట్టదు గుట్టుముట్టగన్

**మంత్రి వజ్జియప్రెగ్గడ :**

నన్నయగారూ! దారిద్ర్యమును శార్దూలముతో పోల్చి వర్ణింపుడు.

**నన్నయభట్టు :**

బలవద్దైన్యము వక్త్రగహ్వరముగా బల్పోట్ల గొన్నట్టి య
ప్పులు మై జాఱులుగాఁగ బాలరుదితంబుల్ గర్జనల్గాఁగ దు
ర్నిలయారణ్యము లోభయప్రకరమూర్తి క్రూరమైయుండగా
తలమే వెల్వడజేయ లావుకలిమిన్ దారిద్ర్యశార్దూలమున్.

**మంత్రి వజ్జియప్రెగ్గడ :**

బేతనగారూ! గారవు ....... నొక్కటన్.

**బేతనభట్టు :**

ఊరకవచ్చు పాటుపడకుండినవైన ఫలం బదృష్ట మే
పారగఁ గల్గువానికి ప్రయాసమునందిన దేవదానవుల్
వార లటుండగా నడుమవచ్చిన శౌరికిఁ గల్గెఁ గాదె శృం
గారపుఁబ్రోవు లక్ష్మియును కౌస్తుభరత్నము రెండునొక్కొటన్.

**మంత్రి వజ్జియప్రెగ్గడ :**

భీమకవీంద్రా! పశుపతి...... రిత్తవోవునే.

**వేములవాడ భీమన :**

బిసరుహగర్భు వ్రాతయును విష్ణుని చక్రము వజ్రి వజ్రమున్
దెసలను రామబాణము యుధిష్ఠిరు కోపము మౌని శాపమున్
మసకపు పాముకాటును కుమారుని శక్తియు కాలుదండమున్
పశుపతి కంటిమంటలును పండితవాక్యము రిత్తపోవునే.

**మంత్రి వజ్జియప్రెగ్గడ :**

చినమల్లనగారూ! గణితశాస్త్రప్రశస్తి నుగ్గడింపగోరెదను.

**చినమల్లన :**

అర్కాదిగ్రహపంచకగ్రహణకాలాన్వేషణోపాయమున్
తర్కవ్యాకరణాగమాది బహుశాస్త్రప్రోక్త నానార్థ సం
పర్కాది వ్యవహారమున్ భువనరూపద్వీపవిస్తారమున్
తర్కింపన్ గణితప్రవృత్తి వెలిగాన్ తక్కొండెతింగించునే.

**మంత్రి వజ్జియప్రెగ్గడ :**

నారాయణభట్ట మంత్రీంద్రులు గోదావరిని చూచి ఆనందపరవశులైరని వింటిని. వారా ప్రవాహమును వర్ణింపగా వినవలయునని యున్నది.

**నారాయణభట్టు :**

స్థిరపుణ్యోదయ మేదినీందువదనా సీమంతవీథీలస
ద్గురు ముక్తాఫలసూత్రమో సురుచిరక్షోణీపురంధ్రీ సమా
దర ధమ్మిల్ల లతాంతమాలికయొ, భూతన్వీకుచశ్రీమనో
హర నిర్మాల్యము నాగ, నీదగు ప్రవాహంబొప్పున్ గోదావరీ.

**మంత్రి వజ్జియప్రెగ్గడ :**

యువరాజా! దరవదనారవింద.... గొల్చెదన్ - పూరింపుడు.

**యువ రాజు :**

పరిణయవేళయందు నిజభర్తృవిభూషణ శేషపూత్కృతి
స్ఫురణ దలంచి కన్మోగిచి చూడగనోడి నమశ్శివాయ యం
చర నుడిపోక సిగ్గుపడి యౌదల నంటిన మందహాస సుం
దర వదనారవిందయగు తన్వి మహీధర కన్య గొల్చెదన్.

## III

**బేతనభట్టు :**

దాయాదుల బెడద వదలినది. ఇంక బౌద్ధజైనాదుల బెడద వదలించుకొనవలయును. ప్రభువులవారి మతనహానమును మృదుహృదయమును అవకాశముగ తీసికొని బౌద్ధులును జైనులును మనభాష నేర్చుకొని తమ తమ మతముల గొప్పతనము ప్రచారముచేసి సామాన్యప్రజలను వానిలోనికి త్రిప్పుకొనుచున్నారు. హైందవులు నూటికి ఏబదిమంది బౌద్ధులుగానో జైనులుగానో మారినారు.

**వేములవాడ భీమన :**

ఇది సహింపరానిది. దీని నరికట్టుట కేదో యుపాయము సత్వరమే ఆలోచింపవలయును.

**పెదమల్లన :**

భారతమును, పురాణములును సంస్కృతములో నున్నవి. అవి మన సంస్కృతిసంపదకు నిధానములు. వానిని మనభాషలోని కనువదింపజేసినచో చాల మేలు కలుగును.

**రాజరాజు :**

మొన్న చోళరాజ్యమున కరిగినపుడు పెరుందేవనారను కవి భారతమును తమిళమున వ్రాసి కొన్ని పద్యములు చదివి వినిపింపగా వింటిని.

**నారాయణభట్టు :**

పంపమహాకవి కన్నడమునకూడ విక్రమార్కవిజయమను పేర దానిని రచించినాడు.

**వేములవాడ భీమన :**

నే నందలి భాగములను వింటిని. అది జైనమతానుగుణముగా వ్రాయబడినది.

**నారాయణభట్టు :** ఔనది సత్యమే.

**బేతనభట్టు :**

మనము వ్యాసభగవానుని భారతమును ఊరూరను పండితులచే పురాణముగా చెప్పింతము. ఇది పంచమవేదము. హైందవమతముయొక్క యౌత్కృష్ట్యము తెలియజేయును.

**కులోత్తుంగుడు :**

పదునెనిమిది పురాణములను పండితులచే ప్రజాసమూహమున ప్రచారము చేయింతము.

**మల్లన :**

ఇప్పుడు సంస్కృతము నర్థముచేసికొనువారి సంఖ్య తగ్గిపోయినది. తెలుగున అర్థము చెప్పించినను అందలి పరమార్థము వారి హృదయములందు హత్తుకొనుట కష్టము.

**నారాయణభట్టు :**

ఇతర పురాణములు చెప్పించుటవలన అంతగా లాభముండదు. అవి పాక్షికములు. కొందరికి మాత్రమే రుచించును. భారతము సర్వధర్మ సమన్వయ సంధానదక్షమైనట్టిది.

**సీ॥ ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని**
**యధ్యాత్మవిదులు వేదాంతమనియు**
**నీతివిచక్షణుల్ నీతిశాస్త్రంబని**
**కవివృషభులు మహాకావ్యమనియు**
**లాక్షణికులు సర్వలక్ష్య సంగ్రహమని**
**యైతిహాసికు లితిహాసమనియుఁ**
**బరమ పౌరాణికుల్ బహుపురాణ సముచ్చ**
**యంబని మహిఁ గొనియాడుచుండ**

వివిధ వేదతత్త్వవేది వేదవ్యాసుఁ
డాదిముని పరాశరాత్మజుండు
విష్ణుసన్నిభుండు విశ్వజనీనమై
పరఁగుచుండఁ జేసె భారతమ్ము.

**రాజరాజు :** మాకును అదియే అభిమతము.

విమలమతిం బురాణములు వింటి ననేకములర్థధర్మశా
స్త్రముల తెఱంగెఱింగితి సుదాత్తరసాన్విత కావ్యనాటక
క్రమములు పెక్కుసూచితి జగత్పరిపూజ్యములైన ఈశ్వరా
గమములయందు నిల్పితి ప్రకాశముగా హృదయంబు భక్తితోన్

**చేతనభట్టు :**

అమితాఖ్యానక శాఖలం బొలిచి వేదార్థామలచ్ఛాయమై
సుమహావర్గ చతుష్కపుష్పవితతిన్ శోభిల్లి కృష్ణార్జునో
త్తమ నానాగుణ కీర్తనార్థఫలమై ద్వైపాయనోద్యానజా
త మహాభారత పారిజాత మమరున్ ధాత్రీసురప్రార్థ్యమై.

**పెదమల్లన :**

మహాభారతము నిజముగా పారిజాతమే!
"యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్" అని వ్యాసభగవానుడే చెప్పినాడు.

అమల సువర్ణశృంగఖురమై కపిలంబగు గోశతంబు ను
త్తమ బహువేదవిప్రులకు దానముచేసిన తత్ఫలంబు త
థ్యము సమకూరు భారతకథాశ్రవణాభిరతిన్ జనాళి చి
త్తము ననిశంబు భారతకథాశ్రవణప్రియమై యెసంగెడిన్.

**కులోత్తుంగుడు :**

దానిని వినుటయే పుణ్యప్రదమని చెప్పుదురు.

బహుభాషల బహువిధముల
బహుజనములవలన వినుచు భారతబద్ధ
స్పృహులగువారికి నెప్పుడు
బహుయాగంబుల ఫలంబు పరమార్థమగున్.

**చినమల్లన :** ఔను.

**ఆయుష్యం బితిహాస వస్తుసముదాయం బైహికాముష్మిక**
**శ్రేయఃప్రాప్తి నిమిత్త ముత్తమసభాసేవ్యంబు లోకాగమ**
**న్యాయైకాంత గృహంబు నాఁబరఁగి నానావేదవేదాంత వి**
**ద్యాయుక్తంబగుదానిఁ జెప్పఁదొడఁగెం దద్భారతాఖ్యానమున్.**

**రాజరాజు :** నా హృదయమున ఐదువిషయములపై మక్కువ ఎక్కువగా నుండును.

**ఇవియేనున్ సతతంబు నాయెదఁగరంబిష్టంబులై యుండుఁబా**
**యవు భూదేవకులాభితర్పణ మహీయఃప్రీతియున్ భారత**
**శ్రవణాసక్తియుఁబార్వతీపతి పదాబ్జధ్యాన పూజామహో**
**త్సవమున్ సంతతదానశీలతయు శశ్వత్సాధుసాంగత్యమున్.**

అదియునుగాక మరొక విశేషముకూడ గలదు.

**హిమకరుఁదొట్టి పూరు భరతేశ కురుప్రభు పాండుభూపతుల్**
**క్రమమున వంశకర్తలనగా మహి నొప్పిన యస్మదీయ వం**
**శమునఁ బ్రసిద్ధులై విమలసద్గుణ శోభితులైన పాండవో**
**త్తముల చరిత్ర నాకు సతతంబు వినంగ నభీష్ట మెమ్మెయిన్.**

**వేములవాడ భీమన :**

భారతాంధ్రీకరణము ఈ సందర్భమున మిక్కిలి ఉచితముగా నుండును.

**ఆయురర్థులకు దీర్ఘాయురవాప్తియు**
**నర్థార్థులకు విపులార్థములును**
**ధర్మార్థులకు నిత్యధర్మసంప్రాప్తియు**
**వినయార్థులకు మహావినయమతియు**
**పుత్రార్థులకు బహుపుత్ర సమృద్ధియు**
**సంపదర్థులకిష్ట సంపదలును**
**గావించు నెప్పుడు భావించి వినుచుండు**
**వారల కి మ్మహాభారతంబు**

**భక్తియుక్తులైన భాగవతులకు శ్రీ**
**వల్లభుండు భక్తవత్సలుండు**
**భవభయంబు లెల్లఁబాపి యిష్టార్థ సం**
**సిద్ధి గరుణతోడఁజేయునట్లు.**

**యువరాజు :**

**సాత్యవతేయ విష్ణుపదసంభవమై విబుధేశ్వరాబ్ధి సం**
**గత్యుపశోభితంబయి జగద్విదితబగు భారతీయ భా**
**రత్యమరాపగౌఘము నిరంతర సంతత పుణ్యసంప దు**
**న్న త్యభివృద్ధిసేయు వినినం గొనియాడిన నెల్లవారికిన్.**

**మంత్రి వజ్జియ ప్రెగ్గడ :**

నన్నయ్యభట్టుగారు మార్కండేయ దేవాలయమున మహాభారతము నొక యేడాదినుండి చెప్పుచున్నారు. మొన్న ముగింపుటుత్సవమునకు మమ్మాహ్వానించినారు. భారతమునెడ జనులకుఁగల యుత్సాహము వర్ణింపనలవి కాదు.

**బేతనభట్టు :**

అది నిజమే. కానీ దానిని అనువదింపఁగల వారెవ్వరు ?

**క్షేమేంద్రుడు :**

ఎవ్వరనువదింతు రనుమాట యటుండనిండు. ఆ పంచమవేదమును దేశభాషలోని కనువదించుట దానిని మలినీకరించుటయు అగౌరవించుటయు నగును. వేదమునకు అమరభాషయే తగినది.

**వేములవాడ భీమన :**

క్షేమేంద్రా! అది నిజమే. కానీ పరిస్థితులనుబట్టి ఒకమెట్టు క్రిందికి దిగవలయును. సామాన్యజనులకు సంస్కృతమర్థముగాదు గదా! పద్యమునకున్నంత శక్తి గద్యమునకుండదు. అందుకనియే శ్రమపడి తెనుఁగున ఛందోగ్రంథము వ్రాసి దానికి 'కవిజనాశ్రయ'మని పేరు పెట్టితిని.

**కులోత్తుంగుడు :** అది నిజముగా కవిజనాశ్రయమే.

**క్షేమేంద్రుడు :**

తెలుఁగులో పద్యములు వ్రాసికొనుఁడు. కాని పంచమవేదము జోలికి మాత్రము పోకుఁడు.

**రాజరాజు :**

నన్నయ్యగారప్పుడప్పుడు భారతమునందలి కొన్నికొన్ని యుపాఖ్యానములను నాకుకూడా వివరించి చెప్పిరి. ఆవేశము కల్గినప్పుడు అచ్చటచ్చట వారాశువుగా శ్లోకములను తెలుఁగుపద్యములుగా ననువదించి చదివియుండిరి. అవియెంతో రసవంతముగా నున్నవి. నన్నయగారూ! ఉదంకుఁడు నాగరాజులను స్తుతించిన యా పద్యము జ్ఞాపకమున్నదా?

**నన్నయభట్టు :**

**బహువనపాదపాబ్ధి కులపర్వత పూర్ణసరస్సరస్వతీ**
**సహిత మహామహీభర మజస్ర సహస్ర ఫణాళిఁదాల్చి దు**
**స్సహతర మూర్తికిన్ జలధిశాయికి పాయకశయ్యయైన య**
**య్యహిపతి దుష్కృతాంతకుఁడనంతుఁడు మాకుఁ బ్రసన్నుఁడయ్యెడున్.**

**మల్లన :** అద్భుతముగా నున్నది. ఇదియును వేదబుక్కువలెనే ధ్వనించుచున్నది.

**చినమల్లన :**

నేనును తెలుఁగులో మహావీరాచార్యుల 'గణితసారసంగ్రహ'మును తెలుఁగున పద్యములలో వ్రాయవలెనని యత్నించుచున్నాను. కాని చాల శ్రమ యగుచున్నది. ఇంతవర కిరువది పద్యములను మాత్రమే వ్రాయగల్గితిని. మొన్న దేవాలయమున నన్నయగారు యయాతిచరిత్ర చెప్పుచు ఒకపద్య మాశువుగా చెప్పగా వింటిని. విని నా ప్రయత్నము చాలించుకుంటిని.

**వేములవాడ భీమన :**

నీ ప్రయత్నము నాకుఁదెలియును. అప్పుడప్పుడు ఛందోవిషయములను గూర్చి నీ వడుగుచుంటివిగదా! అప్పుడేయనుకొంటిని. నీవేదో యా ప్రయత్నము చేయుచుంటివని. కానీ నన్నయగారి పద్యమునువిని నీవు మానుకొనుటయేమి?

**చినమల్లన :** ఆ మాధుర్యము ధారాశుద్ధి చూచి యెవ్వరైనను సిగ్గుపడవలసినదే!

**నారాయణభట్టు :** నన్నయగా రాపద్యము చదివిన విని ఆనందింతుము.

**నన్నయభట్టు :**

ఏదో యప్పుడు చెప్పితిని. అది యంత ఉత్తమముగా నుండునని నేననుకొనలేదు.

**అసదృశయౌవనం బిది యనన్యధనంబగు నొక్కొ నాకు ని**
**క్కు సుమ సముద్గమంబును నగోచర దుర్గమ దుర్గవల్లరీ**
**కుసుమ సముద్గమంబగునొకో పతిలాభము లేమిఁజేసి యొ**
**ప్పెసఁగఁగ దేవయాని పతి నేమి తపం బొనరించి కాంచెనో.**

**రాజరాజు :** మల్లనగారు చెప్పినదానిలో అతిశయోక్తి లేదు.

**వేములవాడ భీమన :** మల్లనా! నీ పద్యమొకటి వినిపింపుము.

**మల్లన :**

అదియును ఒక పద్యమేనా! అదిగాక లెక్కల విషయమున రసమెక్కడి . నుండి వచ్చును?

**రాజరాజు :** చదువుఁడు. లెక్కల పద్య మెట్లుండునో చూతము.

**చినమల్లన :**

**చెలికి షడంశమున్ ప్రియకు శేషము లోపల పంచమాంశమున్**
**బొలుపుగ దానిశేషమున బోదకు నాల్గవపాలు నిచ్చి యం**
**దుల తన పాలు దాఁగొనియె తొమ్మిది జేనలు రాజహంస మీ**
**నలినమృణాళ మెంత సుజనస్తుత! మా కెఱిగంగఁ జెప్పుమా!**

**వేములవాడ భీమన :**

మల్లనా! లెక్కలైన నేమి? ఎక్కడలేని మాధుర్యము ఉట్టిపడుచున్నది.

**చినమల్లన :** అది నాయెడ మీకుఁగల వాత్సల్యము.

**నన్నయభట్టు :**

కాదు కాదు మల్లనా! పద్య మెంత చక్కగా వ్రాసితివి తాతగారికి వినిపించితివా?

**పెదమల్లన :**

వింటిని. ఏదో వ్రాయుచున్నాఁడని సంతసించితిని. కాని మీవంటి దిగ్గంతులచెంత చదువఁదగిన పద్యములుకావు.

**నన్నయభట్టు :**

మీరట్లనక యే మందురు? ఇంతకుముందు శాసనములలో వారు వారు వ్రాసిన పద్యములకంటె వేయిరెట్లు హృద్యముగా నున్నవి.

**క్షేమేంద్రుడు :** ఇంతకును ఆ నలినమృణాళ మెన్నిజేనలో తెలిసినదికాదు.

**చినమల్లన :**

తమకు తెలియకపోవుటయేమి? నానోట చెప్పింపవలెనని అట్లడుగుచున్నారు. దానిపొడవు పదునెనిమిదిజేనలు.

**నారాయణభట్టు :**

మల్లనా! నీ ప్రజ్ఞ అసాధారణము. ఈ పదునెన్మిది సంఖ్యచే జయశబ్దవాచ్యమైన మహాభారతమును సూచించితివి.

**క్షేమేంద్రుడు :** ఔను. అందలి పర్వములు పదునెన్మిది.

**కులోత్తుంగుడు :** మహాభారతయుద్ధము పదునెన్మిది దినములు జరిగినది.

**రాజరాజు :** అందు పాల్గొన్న అక్షౌహిణుల సంఖ్యయు పదునెన్మిదియే.

**పెదమల్లన :** అన్నిటికన్న మిన్న. మహాభారతహృదయమని చెప్పఁదగిన భగవద్గీతలో

**వేములవాడ భీమన :**

మీరన్నట్లు పదునెన్మిది సంఖ్య సర్వతోముఖమై పదునెన్మిది పురాణములను, పంచమవేదమైన మహాభారతమును చక్కగా సూచించుచున్నది. మహాభారతాంధ్రీకరణమవశ్య కర్తవ్యము. పురాణములు ఆయా మతములకు చెంది పాక్షికములై యుండును. భారతమట్లుగాక విశ్వజనీనము. సర్వసమ్మతము.

**రాజరాజు :**

ఔను. నన్నయగారూ! జ్ఞాపకము వచ్చినది. నలదమయంతుల విరహమును వర్ణించు పద్యమును చదివెదరా?

**నన్నయభట్టు :**

**నలదమయంతు లిద్దరు మనఃప్రభవానల పీడ్యమానలై**
**సలిపిరి దీర్ఘవాసరనిశల్ విలస న్నవనందనంబులన్**
**నలినదళంబులన్ మృదుమృణాళములన్ ఘనసారపాంసులన్**
**తలిరుల శయ్యలన్ సలిలధారల చందనచారు చర్చలన్.**

**నారాయణభట్టు :** అద్భుతముగా నున్నది. నన్నయగారు మహాప్రతిభాశాలులు.

**వేములవాడ భీమన :** వా రవిరళ జపహోమతత్పరులు.

**మల్లన :** మత్యమరాధిపాచార్యులు.

**చినమల్లన :** ఉభయభాషాకావ్యరచనాశోభితులు.

**క్షేమేంద్రుడు :** నిత్య సత్యవచనులు.

**బేతనభట్టు :** ఋషితుల్యులు.

**మంత్రి వజ్జియ ప్రెగ్గడ :** లోకజ్ఞులు.

**రాజరాజు :**

సత్కవి కుండవలసిన లక్షణములన్నియు వారియందు పుంజీకృతములైనవి. మీయందఱి పక్షమున వారి నొకటి ప్రార్థింతును.

**జననుత! కృష్ణద్వైపా**
**యన ముని వృషభాభిహిత మహాభారత బ**
**ద్ధ నిరూపితార్థ మేర్పడఁ**
**దెనుఁగున రచయింపుఁ మధిక ధీయుక్తి మెయిన్.**

**క్షేమేంద్రుడు :** నేను చెప్పిన విషయ మాలోచించినారు కారు.

**రాజరాజు :**

దయయుంచవలయును. పరిస్థితుల క్లిష్టత మీకుఁదెలియనిది గాదు. దేశకాలములనుబట్టి మనము కొన్ని యభిప్రాయములను మార్చుకొనవలసి వచ్చును. తమకుఁగూడ నా ప్రార్థన మొకటి యున్నది.

**క్షేమేంద్రుడు :** దేవరవారి యనుగ్రహము.

**రాజరాజు :**

మహాభారతము శతసహస్ర శ్లోక పఠితము. దానిని సంస్కృతాభిజ్ఞులు కూడ పఠింపఁజాలరు. దానిని తమరు సంగ్రహరూపమున వెలయింపఁ గోరుచున్నాను.

**క్షేమేంద్రుడు :**

కొలఁదికాలము క్రింద జావానుండి పండితులువచ్చి మహాభారతమును వ్రాయించుకొని వెళ్లిరి. అప్పటినుండియు భారతము సంగ్రహించి భారతమంజరి వ్రాయ నారంభించితిని.

**రాజరాజు :**

మొత్తముమీఁద జైన బౌద్ధమత ప్రచారముల యాట కట్టించుటకు కొంత ప్రయత్నము జరుగుచున్నది. ఆనందము. నన్నయగారూ! మీరు మా ప్రార్థన మన్నింపరా?

**నన్నయభట్టు :**

ప్రభూ! తమమాట నే నెన్నడు కాదంటిని. ఈ దేహప్రాణములు రెండును తమ యధీనములు. కాని యీ కార్యము నెరవేర్చు సామర్థ్యము నాకు లేదు.

**అమలిన తారకాసముదయంబుల నెన్నను, సర్వవేద శా**
**స్త్రముల యశేషసారము ముదంబునఁ బొందను, బుద్ధిబాహు వి**
**క్రమమున దుర్గమార్థజల గౌరవ భారత భారతీ సము**
**ద్రము దరియంగ నీఁదను విధాతృనకైనను నేరఁబోలునే.**

**బేతనభట్టు :**

నన్నయగారూ! బుద్ధిని బృహస్పతులు. మీరే యట్లనినచో నింక నీ భారము వహింపఁగల వారెవ్వరు? ప్రభువుగారి కోర్కె తీర్పఁ గల వారెవ్వరు?

**నన్నయభట్టు :**

భారతమువంటి మహాగ్రంథము వ్రాయుటకు మనభాష తగినంత స్థితిలో లేదు. ఉన్న భాషయైనను స్థిరత్వము లేక ఒక్కొక్క ప్రాంతమున నొక్కొక్క విధముగా నున్నది. మొత్తము తెలుఁగు పదములు వేయికూడా లేవు. ఇట్టి భాషలో పంచమవేదమును వ్రాయ ప్రారంభించుట హాస్యాస్పదముగా నుండును. అదియునుగాక నా పాండిత్య మెంత? నే నెంత? వ్యాసమహర్షి భారతమును పురాణముగాఁజెప్పుట యొకటి. భాషాంతరీకరించుట మరియొకటి. భారతమున గ్రంథగ్రంథులు చాల కలవు. వానిని విడదీయుట సామాన్యకార్యము కాదు.

**నారాయణభట్టు :**

నన్నయా! అది నిజమే. నీ పాండిత్యప్రతిభలు నాకుఁ దెలియును. వినయభూషణుఁడ వగుటచే నట్లనుచున్నావు. కాని నీవు యత్నించినచో అదియంత అసాధ్యము గాదు.

**రాజరాజు :** నేనుకూడా నట్లే భావించుచున్నాను.

**నన్నయభట్టు :**

ప్రభూ! తమ దయయు. భట్టుగారి ప్రేమయు తామిట్లు దలంచుటకు కారణము. వ్యాకరణముకాని ఛందస్సుకాని తగిన సంపదకాని లేని భాషలో భారతమువంటి మహాకావ్యము వ్రాయుట యెట్లు? ప్రేమమైత్రులుకూడ ఒక్కొక్కప్పుడు నిష్కరుణములుగా నుండును.

**రాజరాజు :**

కన్నడ తమిళ భాషలలో నేదోవిధముగా భారత కావ్యములు వెలువడినవి. మనభాష వానికన్న యేమి తక్కువ? మీరు యత్నించి యాంధ్రసరస్వతికి శాశ్వతాలంకారము సమర్పింపవలయును.

**బేతనభట్టు :**

నన్నయగారు రచించినచో తెలుఁగు భారతము తమిళ కన్నడ భారతములను మించునని నా యభిప్రాయము. వారి పద్యములు కొన్ని వింటిమిగదా! ఎంతో ప్రౌఢ సుందరములుగా నున్నవి.

**నన్నయభట్టు :**

దారి తెన్నులేని గహనములో నన్ను పయనింపుమనుచున్నారు. మహాభారత మొక విజ్ఞానకోశము. మహాగహనము. అందు ప్రవేశించుట నావంటి వానికి సాధ్యముగాదు.

**నారాయణభట్టు :**

నన్నయా! నిరుత్సాహపడకుము. ప్రభువువారి యాజ్ఞను నీవు మన్నింపవలయును.

**క్షేమేంద్రుడు :**

నన్నయగారు 'ఆంధ్రశబ్దచింతామణి' అను వ్యాకరణము సంస్కృత మున వ్రాసి నాకు చూపించిరి. రచనకు సంతోషించితిని. కాని దానికి పంచమవేదమే ప్రథమ లక్ష్యమగునని నేను భావింపలేదు.

**కులోత్తుంగుడు :**

నన్నయగారు "విశ్వశ్రేయఃకావ్యమ్" అను మొదటి సూత్రము చదివి వ్యాఖ్యానింపగా వింటిని. ఆ వ్యాకరణమంతయు నాకు బోధింతుమని వాగ్దానము చేసిరి. కాని యీ నడుమ రాజకీయ కార్యవ్యగ్రులయియుండుటచే ఆ కార్యము సాగలేదు.

**నారాయణభట్టు :** మిత్రమా! ఆ గ్రంథము నాకు చూపితివే కాదు?

**నన్నయభట్టు :**

మీకు చూపవలసినంత యుద్గ్రంథముకాదు. సంస్కృత పదములను తత్సమీకరించుట ఎట్లో తెలిసికొందమని చిన్న యత్నమును చేసితిని.

**నారాయణభట్టు :**

అదియే నేను చెప్పఁదలచుకొన్నాను. పంపమహాకవి కన్నడమున చేసిన పనికూడ అదే. ఆయన సంస్కృత పదముల కన్నిటికిని కన్నడ ప్రత్యయములుచేర్చి తత్సమీకరించిరి. రచన ధారాళముగా సంస్కృతమయముగా నుండును. ప్రథమప్రయత్న మట్లుండుట సహజమే. నీవును ఆ మార్గమునే యవలంబింపుము. ఆంధ్ర శబ్దచింతామణితో ఆ ప్రయత్నము నారంభించితివి గదా!

**కులోత్తుంగుడు :**

గురువుగారూ! దేవరవారి కోరిక తప్పక నెరవేర్ప వేడుచున్నాను. ఆ పనికి తమకంటె సమర్థులుండరు.

**నన్నయభట్టు :**

జాంబవదాదులందరును హనుమంతునిచే సముద్రము లంఘింపఁజేసినట్లు మీరందఱును నన్ను మహాభారత సముద్రములో పడవేయుచున్నారు.

**బేతనభట్టు :** ఉపమానము సముచితముగనే యున్నది.

**వేములవాడ భీమన :**

హనుమంతుఁడు శతయోజన విస్తీర్ణమైన సముద్రమును దాటినట్లు నన్నయగారు కూడ శతసహస్రశ్లోక పరిమితమైన సముద్రమును దాటఁజాలుదురు.

**క్షేమేంద్రుడు :**

నడుమ నడుమ విఘ్నములు రావచ్చును. ఇది పంచమవేదముతో చెలగాటము.

**పెదమల్లన :**

క్షేమేంద్రుల వారట్లనరాదు. వారుకూడ మనస్సు మార్చుకొని ఆశీస్సు లందీయవలెను.

**క్షేమేంద్రుడు :3**

నాకుమాత్రము భారతము తెనుఁగున ఉండవలెనను కోర్కెలేదా! కార్యస్వభావము దెల్పితి నంతే.

**చినమల్లన :**

**నేను జాతకమువేసి చూచితిని. నన్నయగారికి విజయము తప్పదు. ప్రభువుగారికి మహత్తరమైన ప్రతిష్ఠకలుగు కాలమిది.**

**రాజరాజు :** హనుమంతుఁడు సముద్రముదాటి జగజ్జననీ దర్శనము గావించినట్లు నన్నయ ఆంధ్రసరస్వతీ పూర్ణస్వరూపసందర్శనము కావించును.

**నారాయణభట్టు :** అందుకు సందేహములేదు.

**నన్నయభట్టు :** ప్రభువులవారి ఆనతి కాదనలేను. కాని విద్వజ్జనుల సాహాయ్యము కావలయును. (అందరు) అది తప్పక లభించును.

**నన్నయభట్టు :** నారాయణభట్టుగారు తరచు రాజమహేంద్రవరము వచ్చు చుండవలయును. నందమపూడికి రావలసియుండునుగదా! వారి సహాయము లభించుచో

**"పాయక పాకశాసనికి భారత ఘోరరణంబునందు నా**
**రాయణునట్లు వానస ధరామరవంశ విభూషణుండు నా**
**రాయణభట్టు వాఙ్మయ ధురంధరుఁడున్ మది కిష్టుఁడున్ సహో**
**ధ్యాయుఁడు నైనవాఁడభిమతస్థితిఁదోడుగ నిర్వహించెదన్."**

**యువ :**
**భవ్యకవిత్వతత్త్వ చయ పారగుఁడాశ్రిత సంయమీంద్ర సం**
**భావ్యుఁడు మౌని వ్యాసభగవానుఁడు తద్భువన ప్రశస్తమౌ**
**కావ్యము నాంధ్రభాషఁ బలుకం గల ధన్యుఁడ వీవె మాకు స్తో**
**తవ్యుఁడ వాదిసత్కవి పదం బధిరోహ మొనర్పవే యిఁకన్**

**రాజరాజు :** పండితుల కందఱికిని నా ప్రార్థన యొకటి యున్నది. తామందఱును భారతప్రతులను పరిశీలించి ప్రక్షేపములను తొలఁగించి యొక శుద్ధప్రతి సిద్ధముచేయ వేఁడెదను.

**నన్నయభట్టు :** ఏవి తొలఁగించవలెనో ఏవి మార్చవలెనో ఎచ్చట పెంపు చేయవలెయునో తామందఱు సూచించి నాకు తోడ్పడవలయును.

**అందఱు :** అది మీ వినయమును సూచించును. తామే ఆ పని చేయఁజాలుదురు. అయినను మేముకూడ యథాశక్తి యత్నింతుము.

# IV

**మంత్రి వజ్జియ ప్రెగ్గడ :** కవిత్వ మెటులుండవలెనని మీ యభిప్రాయము?

**బేతనభట్టు :**
**పరమజ్ఞానలతాలవాలము జగత్ప్రఖ్యాత విఖ్యాతి సా**
**గర చంద్రోదయ మిష్టసంఘటన రేఖాదివ్యధేనూత్తమం**
**బురు కార్పణ్యదశానిశాదినముఖం బుద్వేల నిర్వాణ భ**
**వ్య రసాస్వాద రసాయనం బనిన కావ్యంబెన్న సామాన్యమే.**

**వేములవాడ భీమన :** రసములు తొమ్మిదిం గలుగు రమ్యనవార్థ సుశబ్దమాధురీ
విసరము లుల్లసిల్ల నతి విస్ఫుట లక్షణ చారు చాతురిన్
రసికుల నెమ్మనంబులను రాగము పొంగగఁ దేనెలొల్క నిం
పెసగఁగఁ జెప్పనేర్చు కవియే కవి కావ్య మటన్న వారిదే.

**చినమల్లన :** చెప్పిన పదుగురు మెచ్చగ
చెప్పన్వలె కైత రసము చిప్పిలుచుండన్
కప్పురపు తావు లెల్లెడ
గుప్పుమనన్ మృదుపదాళి గులుకుచు నుండన్.

**క్షేమేంద్రుడు :** చేతశ్శుక్తిక యందు నిల్చి కళలంజేకూరి శాస్త్రోదక
వ్రాతం బక్షరమూర్తి మౌక్తికములై వర్థిల్లగన్ సత్ప్రభు
ఖ్యాత ప్రౌఢగుణప్రయుక్తి సదలంకారాంగ హారాళి నా
రీతిన్ సత్కవి కూర్పనేర్చును బుధశ్రేణీ సభాగ్రంబునన్.

**నన్నయభట్టు :** సారమతిన్ గవీంద్రులు ప్రసన్నకథా కలితార్థయుక్తి లో
నారసి మేలునా నితరు లక్షరరమ్యత నాదరింప, నా
నారుచిరార్థసూక్తితతి నైక విధంబున నాత్యమాడ గం
భీరము సుందరమ్మయి కవిత్వము చిత్తహరంబు కావలెన్.

**పెదమల్లన :** సరసతయును వక్రోక్తియు
సురుచిర శయ్యాసమాస శోభయు వ్యంగ్య
స్ఫురణయు పరనిర్వృతియును
మెఱయ యువతివోలె కవిత మిసమిసలాడున్.

**రాజరాజు :** కలకల నవ్వినట్లు తెలికన్నుల నిక్కము చూచినట్లు తోఁ
బలుకఁ గడంగినట్లు కదుభావగభీరత యబ్బినట్లు పెం
పొలయఁదనర్చి జీవకళయుట్టిపడన్ కవివ్రాసినట్టి యా
చెలువగు కావ్య మార్యజన చిత్తములన్ కరఁగించు ప్రౌఢనాన్.

**యువరాజు :** నవరస భావబంధురము నై గమ ధర్మపథానువర్తన
ప్రవణము సుందరాక్షర నిబద్ధమునై రుచిరార్థసూక్తి వై
భవ విలసన్నిధిత్వ గుణవత్త్వ మహత్వమలంకృతంబు నౌ
కవిత యనంగ నన్నయ ముఖంబున వెల్వడి నట్టిదే సుమీ.

**నారాయణభట్టు :** పదబంధంబుల నగ్గలించి బుధశబ్దభ్రాజియై సద్గుణా
స్పదమై దుష్కవిహృ త్సరోజవనమున్ భంజింపుచున్ భూరి స
మ్మదలీలన్ విలసిల్లి సత్కృతి జగన్మాన్య ప్రభావంబునన్
మదనాగంబును బోలె గ్రాలవలదా మారెందు లేకున్నతిన్.

## V

**మంత్రి వజ్జియ ప్రెగ్గడ :** నన్నయగారి ముఖము తేజోవిరాతమగుచున్నది. వారు సమాధినిష్ఠులవలె నున్నారు. వారినోట ఉజ్జ్వలమగు వాక్కు వెడలుచున్నది.

శ్రీ వాణీ గిరిజా శ్చిరాయ దధతో వక్షోముఖాంగేషు యే
లోకానాం స్థితిమావహంత్యవిహతం స్త్రీ పుంసయోగోద్భవామ్
తే వేదత్రయ మూర్తయస్త్రీపురుషాః సంపూజితావస్సురైః
భూయాసుః పురుషోత్తమాంబుజభవశ్రీకంధరాః శ్రేయసే.

**అందరు :** ఇది యాంధ్రభారతావరణమునకు నాందీశ్లోకమగుఁగాక!

**బేతనభట్టు :** సారకథా సుధారస మజస్రము నా గళపూరితంబుగా
నారగఁగ్రోలుచున్ జనులు హర్షసాంబుధిఁ దేలునట్లుగా
భారత సంహితన్ తెలుఁగుబాస రచింపఁగఁబూనినట్టి వి
ద్యారమణీయు నంధ్ర కవితాగురు నన్నయభట్టుఁ గొల్చెదన్

**వేములవాడ :**
**భీమన** ఉన్నతగోత్ర సంభవము నూర్జితసత్త్వము భద్రజాతి సం
పన్నము నుద్ధతాన్య పరిభావి మదోత్కటమున్ నరేంద్ర పూ
జోన్న యనోచితంబు నయి యొప్పెడి నన్నయభట్ట కుంజరం
బెన్న నిరంకుశోక్తి గతి నెందునుగ్రాలుట సన్నుతించెదన్.

**చినమల్లన :** వేద నిగూఢతత్త్వము భువిం బ్రచురించిన పంచమాగమం
బాదిమభాషలో రచితమౌట తదర్థవిచారమూఢులై
ఏ దెవ రెట్టులాడిన గ్రహించెడి నాంధ్రుల నుద్ధరింప నా
శ్రీదము వేదముల్ తెలుఁగుఁ జేసెడి నన్నయభట్టుఁ గొల్చెదన్.

**కులోత్తుంగుడు :** వేయివిధంబులందు పదివేవురు పెద్దలు సత్రబంధముల్
వ్రాయక చెప్పి రట్లు రసబంధురభావభవాభిరామ గౌ
రేయులు శబ్దశాసనవరేణ్యులు నాఁగ ప్రశస్తికెక్కిరే
యేయెడ నన్న పార్యగతి నిద్ధర నట్టి మహాత్ముఁ గొల్చెదన్.

**క్షేమేంద్రుడు :** "వాచామాంధ్రమయీనాం యః ప్రవక్తా ప్రథమోఽభవత్"
ఆచార్యం తం కవీంద్రాణాం వందే వాగనుశాసనమ్.

పెదమల్లన : యౌవనమందు గంధగజయానము కన్యల కబ్బు నంచు సం
భావన చేయుచుంద్రు కవివర్యులు నన్నయభట్ట శిక్షణ
శ్రీవిభవంబుచేఁ గడు విచిత్రము పుట్టియు పుట్టకుండనే
యా విలస ద్గతిక్రమము లబ్బిన వాంధ్ర కవిత్వ కన్యకున్.

రాజరాజు : శ్రవణానంద కరధ్వని ప్రచితముల్ సంస్కార సంపూర్ణముల్
నవనీతాభములైన శబ్దముల విన్యాసంబుచే నొప్పు నీ
కవనం బా తొలిపల్కు బుక్కులవలెన్ క్రమంబుగా మ్రోయునో
నవగాధత్రయివైన నీ నుడులయం దాశ్చర్యమే తద్ధ్వనుల్.

నారాయణభట్టు : వ్యాకృతి రూపసంపద పదాదిక విస్తృతి ఛందమేమియున్
లేకయ సంస్కృతమ్మును ననిశ్చితిరూపమునౌ తెనుంగుకున్
శ్రీకలితమ్ము మంజుపద చిహ్నితమర్థ గంభీరమైన ర
మ్యాకృతిఁ దీర్చి కర్కశశిలావళి కట్టుము రత్నసౌధమున్.

యువరాజు : ప్రకృతియుగంబుఁ దీర్చు మునివర్యులకున్ సముఁడైనపుణ్యు నిన్
వికృతికి శిక్షగాఁ బదవివేకము గూర్చినవాని నాంధ్రవా
క్ప్రకట కవిత్వ కల్పతరురాజము బీజము చారువాక్య శా
సక బిరుదాంకు నన్నయ విచక్షణవర్యు నమస్కరించెదన్.

రాజరాజు : మా వంశంబున పూజ్యులైన ఘనులన్ మల్లీశరచ్చంద్రికా
ధావళ్యంబుల మించు తద్యశము నుద్యన్మాధురీధారగా
నావర్తించుచు పంచమాగమము వ్రాయంబూని నన్నున్ జిరం
జీవిం జేసిన నన్నిభట్ట సుకవీ! చేమోడ్పు సంధించెదన్.

నన్నయభట్టు : తానే నేనని లోఁదలంచెడి నృపోత్తంసున్ మహాభారతో
ద్యానక్షోణిఁ జరించు భాగ్యమును నాహ్లాదంబుఁ జేకూర్చి య
న్యూనౌన్నత్యపదంబు నాకిడిన సంస్తుత్యాత్ములన్ మిమ్ములన్
గణుతింతున్ గయిమోడ్పుతో వినయమున్ కార్తజ్ఞ్యమున్ మీఱఁగన్

మంత్రి వజ్జియ ప్రెగ్గడ : ఈనాటి సభ మంగళాంతముగను, ఫలవంతముగను ముగిసినది. నేటినుండి నన్నయభట్టుగారి యింట ఆంధ్రసరస్వతీ మంజుమంజీర శింజితములు వినిపించును. వానికి గోదావరీ తరంగిణీ తరంగభంగ భంగిమలు శ్రుతి కల్పించుచుండును. ఆంధ్రులు పంచమవేదమును తమభాషలో వినఁజాలు నదృష్టము కల్పించిన ఈ దినము నిజముగా పర్వదినము. మనసార్వభౌముల పట్టాభిషేక మహోత్సవ దివసముననే ఈ మంగళముకూడ చేకూరుట పరమానందసంధాయకము. మహారాజుగా రీ శుభదినమున కవుల నందరిని యథోచితముగా సన్మానింపఁ గోరుచున్నారు.

(సన్మానము జరుగును) శుభము స్వస్తి

T.T.D. Religious Publications Series No. 170
Price Rs. 11/-

